క్లుప్తంగా

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణతో నష్టం

బాపట్ల అర్బన్: మోదీ ప్రభుత్వంలో మహిళలు, కష్టజీవులకు రక్షణ లేదని, ధరలు విపరీతంగా పెరిగిపోయాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి విమర్శించారు. బాపట్ల పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం సభ్యుడు టి.కృష్ణమోహన్ అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయంతో నష్టం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, సీహెచ్ మణిలాల్, ఎస్.బాబురావు, సీహెచ్ మజుందార్, ఆర్.వినోద్, వసంతరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



బాపట్ల అర్బన్: స్థానిక మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. కళాశాల విద్యార్థినులు 70 మంది రక్తదానం చేశారు. సెక్రటరీ మానం నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ హరి పద్మ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్, డి.రామ్మోహన్రావు జి. దిలీప్ కుమార్, ట్రెజరర్ టి.రామకష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎన్‌సీసీ కెప్టెన్ శ్రీదేవి, అధ్యాపకులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కర్లపాలెం: ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఈఓపీఆర్డీ ఎ.ఎలీషా బాబు పేర్కొన్నారు. కర్లపాలెం గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని సర్పంచ్ నక్కా లలిత కుమారి గురువారం ప్రారంభించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గుంటూరు జిల్లా నుంచి కొత్తగా బాపట్ల జిల్లా ఏర్పడి నందున అందరూ తమ ఆధార్ కార్డుల్లో మార్పులు చేయించుకోవాలని చెప్పారు. ఆధార్ కార్డులో పేర్లు, అడ్రస్‌లు తప్పులు ఉన్నవారు సరైన ధృవీకరణ పత్రాలు చూపించి మార్పులు చేయించుకోవాలని ఎలీషాబాబు తెలిపారు. ఆధార్ కార్డు లేని చిన్న పిల్లలకు తీసుకోవాలని ఆయన సూచించారు. సర్పంచ్ లలితకుమారి, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన మొక్కజొన్న



భట్టిప్రోలు: అకాల వర్షం ప్రభావంతో మొక్క జొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పంటకు పట్టలు కప్పి కాపాడుకుంటున్నారు. పంట పొలాల్లో విరిచిన కండెలు అలానే పడి ఉన్నాయి. పంట నిలువు మీదే ఉంది. తడిచిన పంటను పట్టల మీద ఆరబెడుతున్నారు.

187 మందికి కంటి పరీక్షలు

రేపల్లె రూరల్: చెరుకుపల్లికి చెందిన శ్రీ కామాక్షి ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు పోటు మెరక గ్రామంలోని ఎంపీయూపీ స్కూలులో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వాసుదేవరా, రాజేష్ 187 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ఇత్తడి సర్వాంగం



జంపని(వేమూరు): జంపని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం ఏకాదశి దీక్షతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శిల్పి దేవుమయాచారి తన తండ్రి శంకర్, తాత మయాచార్యులు జ్ఞాపకార్థం ఇత్తడి సర్వంగాన్ని స్వామికి సమర్పించారు. వేదాంతం మాధవ్‌కుమార్ వాస్తు, శాంతి హోమాలు నిర్వహించారు. అంగల కుదురు గ్రామస్తులు వెలగపూడి చంద్రమౌళి దంపతులు స్వామికి సింధూర లేపన ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు మేడూరు శ్రీనివాసమూర్తి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

'సహజయోగ' భవన నిర్మాణానికి భూమిపూజ

తెనాలిటౌన్: పట్టణ నాజ్‌పేటలోని మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ధ్యాన మండలి భవనానికి గురువారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ భూమి పూజ చేశారు. మాతాజీ నిర్మలాదేవి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధ్యాన మండలి సభ్యులు ప్రవచనం చేశారు.

రాజశ్యామల మహాదేవిగా బండ్లమ్మ

- ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం
- చీర, సారెతో ఆహ్వానం పలికిన కుంచలవారిపాలెం వాసులు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో గురువారం వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభ్యంగ స్నానం చేయించి, అభిషేకాలు జరిపించారు. అనంతరం అమ్మవారిని రాజశ్యామల మహాదేవి రూపంలో అలంకరించారు. చెరుకుపల్లి మండలం కుంచలవారి పాలెం శివారు తూర్పు పొలాల నుంచి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి, అమ్మవారిని తమ గ్రామానికి విచ్చేయమని గ్రామస్తులు ఆహ్వానం పలికారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కుంచలవారిపాలెం గ్రామానికి తప్పెట్లు, బ్యాండు మేళాలతో వెళ్ళారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నాయకులు గాదె మధుసూదనరెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలి మండలి సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి మధుసూదనరెడ్డికి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి, సత్కరించారు. పార్టీ నాయకులు దోమ నాగేశ్వర రెడ్డి, డేగల రవిరెడ్డి, మస్తాన్ బేగ్, పట్టాభి తదితరులు ఉన్నారు.



రాజశ్యామల మహాదేవిగా అమ్మవారు



అమ్మవారి ఘటాలతో వంశ పారంపర్య అర్చకులు

పటిష్ట బందోబస్తు..

ఈ నెల 6న అమ్మవారి తిరునాళ్లలో భాగంగా ప్రాచీన బంగారు ఆభరణాలు అలంకరించనున్నారు. ఈ సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు చేపడతామని బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి స్పష్టం చేశారు. ఆలయానికి విచ్చేసిన ఆయన దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడారు. వారి వెంట చందోలు ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

ఆగ్రో ఇండస్ట్రీస్‌తో ఉపాధి కల్పన

మంత్రి మేరుగ నాగార్జున

చదలవాడ(వేమూరు): ఆగ్రో ఇండస్ట్రీస్ ఏర్పాటుతో ప్రజలకు జీవనోపాధి కల్పించడం జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చదలవాడ గ్రామంలో ఆగ్రో ఇండస్ట్రీస్‌ను ఆయన తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ఈ పరిశ్రమ వల్ల జిల్లాలోని చాలా మందికి జీవనోపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, చదలవాడ గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, బొల్లిముంత శ్రీనివాసరరావు, బొల్లిముంత వెంకటేశ్వరరావు, చందు అజయ్‌బాబు, కసుకుర్తి దాసు, సీహెచ్ మల్లికార్జునరావు, కొక్కిల గడ్డ రూపస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆగ్రో ఇండస్ట్రీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, పక్కన మంత్రి నాగార్జున

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొల్లూరు: అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ చేపట్టినట్లు అమర్తలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్తలూరు ప్రాజెక్టు పరిధిలోని కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో ఈ నెల 5 నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అమర్తలూరులోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కార్యాలయంలో స్వయంగా అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులై, గ్రామ పరిధిలో నివాసం ఉంటున్న వివాహితలై ఉండాలన్నారు. అభ్యర్థుల వయస్సు 2023 జులై నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ నోటిఫైడ్ కేంద్రాలకు దరఖాస్తు చేసుకునేవారు.. వయోపరిమితి కలిగిన అభ్యర్థులు లేని పక్షంలో 18 ఏళ్లు నిండిన అభ్యర్థులను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు కేటాయించిన పోస్టులకు సంబంధిత అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ ఆయా పోస్టులు కొల్లూరు మండలంలోని రావికంపాడు-2 కేంద్రంలో ఎస్టీ, కిష్కిందపాలెం-1 కేంద్రంలో జనరల్, దోనేపూడి-3లో జనర్, వేమూరు-5 కేంద్రంలో బీసీ-ఈ, భట్టిప్రోలు మండలంలోని భట్టిప్రోలు వడ్డెర సంఘం కేంద్రంలో బీసీ-ఏ, పెద పులివర్రు జిలుగువాని పాలెం కేంద్రంలో ఎస్సీ, అమర్తలూరు మండలం కేటీ పర్రు కేంద్రంలో జనరల్, చుండూరు మండలం దుండిపాలెం-4 కేంద్రంలో ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు అమర్తలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ప్రమాణ స్వీకారానికి ర్యాలీగా

రేపల్లె: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారికి అధినేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుముచిత స్థానం కల్పిస్తారని ఆ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. బాపట్లలో నిర్వహిస్తున్న బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు ప్రమాణ స్వీకారం సందర్భంగా గురువారం రేపల్లె పార్టీ కార్యాలయం నుంచి మల్లికార్జునరావుతో కలిసి పార్టీ శ్రేణులు బాపట్ల పయనమయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఎంపీ ప్రారంభించి, మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్‌లు గడ్డం రాధాకృష్ణమూర్తి, గాదె వెంకయ్యబాబు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న ఎంపీ మోపిదేవి, బౌడా చైర్మన్ దేవినేని

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

పెనుమర్రు(వేమూరు): జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజవర్ధనరావు తెలిపారు. పెనుమర్రు గ్రామంలో జగనన్న కాలనీని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి, గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు 4 పరీక్ష కేంద్రాలు

రేపల్లె రూరల్: పాలిసెట్ పరీక్షకు నాలుగు కేంద్రాలు సిద్ధం చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.చంద్రశేఖరరావు గురువారం తెలిపారు. కళాశాలలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్ పరీక్ష జరగనుందన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, భాష్యం హైస్కూల్, రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎస్ఎన్‌బీటీ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ కేంద్రాల్లో 675 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు.

కారును ఢీకొట్టి..ఆటో బోల్తా



కొల్లూరు: ఎదురుగా వస్తున్న కారును ఆటో ఢీకొట్టి బోల్తా కొట్టిన ఘటన గురువారం కొల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రేపల్లె నుంచి కొల్లూరు వైపు వస్తున్న ఆటో విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద అదుపు కోల్పోయి కొల్లూరు నుంచి రేపల్లె వైపు వెళ్తున్న కారును ఢీకొట్టింది. తన వైపు దూసుకొస్తున్న ఆటోను గమనించిన డ్రైవర్ కారును రహదారి అంచుకు మళ్లించడంతో పెను ప్రమాదం తప్పింది. కారును ఢీకొట్టిన ఆటో రోడ్డుపై బోల్తా కొట్టినప్పటికీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ రామయ్య ఘటనా ప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు.

పంట పొలాల పరిశీలన

తెనాలిటౌన్: ద్రోణి ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండల గ్రామాల్లోని సాగులో ఉన్న మొక్కజొన్న, జొన్న పంటలు కొంత మేరకు దెబ్బతిన్నాయి. వర్షాలు రెండు రోజుల నుంచి భారీగా కురుస్తుండటంతో మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేస్తున్న రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలకు తడిచిన మొక్కజొన్న, జొన్న పంటలను వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పరిశీలించారు.

ఐతానగర్, గుడివాడ, నేలపాడు, తేలప్రోలు తదితర గ్రామాల్లో పైరులను పరిశీలించి ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఓ ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో నీటిని తీసివేసి ఉప్పు ద్రవాణాన్ని పిచికారీ చేయాలని చెప్పారు. కండెలను ఆరబెట్టాలని సూచించారు. వర్షాలకు తడవకుండా కండెలు, కంకులపై టార్పాలిన్ పట్టాలు వేసుకోవాలని సూచించారు. తెనాలి మండలంలో 400 ఎకరాల్లో మొక్కజొన్న, 200 ఎకరాల్లో తెల్లజొన్న వర్షాలకు దెబ్బతినట్లు తెలిపారు. పంట నష్టం వివరాలను అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు ఆలీ, తేజస్విని, గ్రామాల్లోని ఆర్బీకే సిబ్బంది, రైతులు ఉన్నారు.



ఐతానగర్‌లోని పొలాల్లో జొన్న కంకులను పరిశీలిస్తున్న ఏఓ ప్రేమ్‌సాగర్, రైతులు

నష్టపరిహారం చెల్లించాలి ..

తెనాలి: అకాల వర్షాల వలన నష్టపోయిన జొన్న, మొక్కజొన్న రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్ట పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రూరల్ మండలం తేలప్రోలు, నేలపాడు, అత్తోటలో గురువారం రైతులుతో కలసి పంట పొలాలను పరిశీలించారు. ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా నష్టపోయిన ప్రతి పొలాని రెన్యూమూరేట్ చేయాలని కోరారు. తేలప్రోలు మాజీ సర్పంచ్ వేజండ్ల రోశయ్య, మహబూబ్ ఖాన్, అడుసుమల్లి పవన్, వేజండ్ల నాగేశ్వరరావు, తోమాట్టి లుతార్, అమృతలూరి సురేష్, పాల్గొన్నారు.

వైశ్య విద్యానిధి స్థలం పారదర్శకంగానే విక్రయం

కమిటీ కార్యదర్శి, సభ్యుల వివరణ

తెనాలిరూరల్: పట్టణ శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్యవిద్యానిధికి చెందిన నాజరుపేటలోని స్థలంలో కొంత భాగాన్ని పారదర్శకంగానే విక్రయించినట్లు వైశ్యవిద్యా నిధి కమిటీ వెల్లడించింది. వైశ్యవిద్యానిధి ఆవరణలో గురువారం విలేకరుల సమావేశంలో కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు, ఇతర సభ్యులు మాట్లాడుతూ సంబంధిత స్థలాన్ని దాతలు 1953లోనే విద్యానిధికి ఇచ్చినట్టు తెలిపారు. కాలక్రమంలో అన్యాక్రాంతమవగా, తగిన పత్రాలు లేక, స్వాధీనం చేసుకోవడంలో జాప్యం జరిగిందన్నారు. ఇటీవలి కాలంలో స్థలం పత్రాలు దొరికాయని, కమిటీ ఆమోదంతోనే 240 గజాలను విక్రయించినట్టు తెలిపారు. సభ్యులు పెండేల చంద్రశేఖర్, కొప్పురావూరి హరికిషోర్‌లు మాట్లాడుతూ విద్యానిధి కమిటీలో సభ్యులమైన తాము స్థలం తక్కువ ధరకు విక్రయించడాన్ని ప్రశ్నించామని చెప్పారు. కార్యదర్శి వివరణతో సంతృప్తి చెందినట్టు తెలిపారు. తమను ఆలపాటి రాజా బెదిరించాడనడంలో ఎటువంటి వాస్తవం లేదన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

జంపని(వేమూరు): అకాల వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతినకుండా రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్త సుధారాణి తెలిపారు. జంపని గ్రామంలో మొక్కజొన్న పంటను ఆమె గురువారం పరిశీలించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా పొలాల్లో ఉండటంతో రైతులు చాల ఇబ్బందులు పడుతున్నారని ఆమె చెప్పారు. పొలాల్లో ఉన్న మొక్కజొన్న పంటను పట్టాలు కాపాడుకోవాలని సూచించారు. తడిన పంటపై ఉప్పు ద్రావణాన్ని చల్లుకోవాలని చెప్పారు. పంట నష్టం అంచనా వేయడం జరుగుతుందన్నారు. అకాల వర్షాల నుంచి పంటలు కాపాడుకునేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ అక్తర్, రేపల్లె డివిజనల్ వ్యవసాయాధికారి షేక్ హుస్సేన్, మండల వ్యవసాయాధికారి చందోలు సునీత, రైతు భరోసా సిబ్బంది మహాలక్ష్మి, చందన్ ఉన్నారు.



జంపని గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించిన వ్యవసాయ శాఖాధికారులు

చలనచిత్ర రంగంలో ప్రభంజనం దాసరి

బాపట్ల: తెలుగు చలనచిత్ర రంగంలో ఒక వినూత్న ప్రభంజనాన్ని సృష్టించిన బహుముఖ ప్రజ్ఞాశాలి దర్శకరత్న దాసరి నారాయణరావు అని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ పేర్కొన్నారు. దాసరి నారాయణరావు 76వ జయంతి సందర్భంగా సాహితిభారతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రావూరి మాట్లాడుతూ దాదాపు 150 చిత్రాలకు దర్శకత్వం, 250 చిత్రాలకు రచన, 53 చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారని గుర్తుచేశారు. తెలుగు చిలన చిత్రరంగానికి దాసరి నారాయణ చేసిన సేవలను భావితరాలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాహితీ భారతి నాయకులు మాల్యాద్రి, శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు, మురళీ, రాధాకృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



దాసరి చిత్రపటానికి నివాళి

ప్రతి చిన్న సినిమాను విడుదల చేయాల్సిందే

తెనాలి: సెన్సార్ పూర్తిచేసుకున్న ప్రతి చిన్న సినిమా విడుదలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా విజ్ఞప్తిచేశారు. దర్శకుల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మా-ఏపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందుకోసం సినీపెద్దలు, యూనియన్ల నాయకులతో చర్చించి ఒక కార్యాచరణను అమలుచేయటం అవసరమన్నారు. కొందరు పెద్దల చేతుల్లో థియేటర్లు ఉన్నందున పలు చిన్న సినిమాలు విడుదలకు నోచుకోవటం లేదన్నారు. పెద్ద సినిమాలకు నెలలో 20 రోజులు, చిన్న సినిమాలకు 10 రోజులు ప్రదర్శనకు అనుమతించాలని, విడుదలైన సినిమాను ప్రేక్షకులు ఆదరించకపోతే మూడోరోజున వేరే సినిమా ప్రదర్శించుకుని థియేటర్ల యాజమాన్యం నష్టపోకుండా ప్రత్యామ్నాయ చర్యలను రూపొందిస్తూ జీఓను తీసుకురావాలని సూచించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

రేపల్లె రూరల్: రావి అనంతవరం గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం అర్చకులు దీవి రాజగోపాల్, దీవి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి, దేవేర్ల ఉత్సవ మూర్తులకు మంగళ స్నానాలు చేయించి, పట్టువస్త్రాలు ధరింప చేశారు. పుష్పాలతో అలంకరించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జయంతి

చెరుకుపల్లి: రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ అనువంశిక అర్చకుడు బృందావనం వెంకట లక్ష్మీనరసింహ ఫణికుమార్ తెలిపారు. గూడవల్లి గ్రామంలో గురు, శక్రవారం వారాల్లో స్వామివారి జయంతి ఉత్సవాలు జరుగతాయన్నారు. మొదటి రోజు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, అగ్ని ప్రతిష్టాపన, మహా శాంతి హోమం, ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జంజనం సాంబ శివరావు, మహిళలు పాల్గొన్నారు.

నేడు ఆనందీశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ

చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగాంబికా సమేత ఆనందీశ్వర స్వామి దేవస్థానం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. శైవాగమ సహస్రశతాధిక ప్రతిష్ఠాచార్య, ఆంధ్ర ప్రదేశ్ అర్చక ఆగమ ఎగ్జామినర్ బ్రహ్మశ్రీ స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఆనందీశ్వర స్వామి ఆలయ సన్నిధిలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠకు హోమ గుండం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రయాగ రాంబాబు శర్మ మాట్లాడుతూ.. 5న శుక్రవారం ఉదయం 10: 59గంటలకు పడితపు వెకటరమణ మహాలక్ష్మి దంపతుల సహాయ సహకారాతో నూతన జీవధ్వజ, స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ ఉదయలక్ష్మి దంపతుల సహకారంతో ఆలయ శిఖర ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారయణ, చైర్మన్ ఓగిరాల వీరాస్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



ఆలయంలో హోమం



విద్యుత్ ప్రభ వెలుగులు



ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు

ఘనంగా ఓలేరు తిరునాళ్ల

ఓలేరు(భట్టిప్రోలు): ఓలేరు గ్రామంలో వేంచేసియున్న ఓలేటమ్మ తిరునాళ్ల మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధికి వెంకట్రాజునగర్, ఓలేరు నుంచి ప్రభలు వచ్చాయి. ఓలేరు గౌడపాలెం నుంచి చిన్నారులు ప్రభను కట్టుకుని అమ్మవారి సన్నిధికి తీసుకువచ్చారు. పూజా కార్యక్రమాలను నిర్వాహకులు బేతపూడి రజనీకాంత్ పర్యవేక్షించారు.

వైభవంగా దేశమ్మ తిరునాళ్ల

గొరిగపూడి(భట్టిప్రోలు): గొరిగపూడి గ్రామ దేవత దేశమ్మ తల్లి తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారికి పసుపు, కుంకుమ, చద్ది నైవేద్యాలు సమర్పించారు. విద్యుత్ ప్రభలు కట్టి, కనక తప్పెట్లు, ఆటపాటలతో తెల్లవార్లూ అమ్మవారి తిరునాళ్ల వైభవంగా కొనసాగింది.

6న పోలేరమ్మ జాతర

వేమవరం(భట్టిప్రోలు): వేమవరంలో కొలువైన పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవం ఈ నెల 6, 7 తేదీల్లో జరుగుతాయని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం చద్ది నైవేద్యాల సమర్పణ, 6న ఘటం కుండ ఊరేగింపు, 7న అమ్మవారికి మొక్కుల చెల్లింపు ఉంటుందన్నారు.

ఘనంగా కట్లమ్మ తల్లి మహోత్సవాలు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో కొలువైన శ్రీ కట్లమ్మ తల్లి ఆలయ 25వ వార్షిక మహోత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారికి నిత్య పూజ నిర్వహించి, చద్ది నైవేద్యాలు సమర్పించారు. క్రోవి రామకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి లక్ష మల్లె పూల పూజ నిర్వహించారు.

వైభవంగా అంకాళమ్మ తిరునాళ్ల

చెరుకుపల్లి: నడింపల్లి గ్రామ ప్రజల ఇలవేల్పు శ్రీ అంకాళమ్మ తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాల నడుమ మహిళలు నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో వివిధ సామాజిక వర్గాలు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశాయి. వైఎస్సార్ సీపీ నాయకులు డిజిటల్ విద్యుత్ దీపాల ప్రభలు ఆకట్టుకున్నాయి. కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఫైనాన్స్ సంస్థ మేనేజర్‌పై దాడి

తెనాలిరూరల్: ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ మేనేజర్‌పై దాడి చేసి గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన చంద్రశేఖర్ 2019లో ఓ ఫైనాన్స్ సంస్థ వద్ద కారు లోన్ తీసుకున్నాడు. వాయిదాలు చెల్లించక తప్పించుకు తిరుగుతున్నాడు. బుధవారం వాహనాన్ని ఫైనాన్స్ సంస్థ సిబ్బంది స్వాధీనం చేసుకుంటుండగా చంద్రశేఖర్, మరో ఇద్దరు సంస్థ మేనేజర్ మల్లోల నాగమల్లేశ్వరరావుపై దాడి చేసి గాయపర్చారు.